# ఊపిరాడని నగరం

బోయ జంగయ్య

ఊళ్లన్నీ తిరిగిన ఓ కాకి, ఓ ఊరపిచ్చుక లారీ మీద కూర్చుని పట్టణం తోవ పట్టినవి. లారీ పరిగెత్తుతుంది. పక్షులు ఎడమపక్క చూసినయి. ఓ పెద్దగేటు, ఇరుపక్కల పచ్చి గడ్డి లోపల అన్ని కార్లు నిలుచున్నయి 'చూస్తివా దాని సంగతి ఏమిటనుకున్నవు. అదంతా ఒక్క మనిషిదే! వేల ఎకరాలు. ఆ బంగళాలు భవంతులు అన్నీ ఒక్కనివె. అక్కడికి దేశం నలుమూలల నుండి వచ్చి పోతుంటరు. సినిమాలు కూడా తీస్తరు. ఆటలు పాటలు. నడుస్తయి. లోపలికి పోతందకు టికటు కొనాలి సుమా?'' అంది కాకి.

''మనకేం టికట్'' అడిగింది పిచ్చుక.

''సరె మనం ఈ లారీ దిగితె మల్ల మనకు'' అంటు ఆగింది కాకి.

''ఏం దొరుకతదనా? మస్తు బస్సులు ఇక్కడికె వచ్చి పోతుంటయి ఏ బస్సు మీద కూర్చున్న పాయె! అంది పిచ్చుక.

''అవును కదా బస్సెనకబస్సు వస్తనే వున్నయి'' అంది కాకి.

''వద్దులే, మల్లెపుడన్న చూద్దాం'' అంది పిచ్చుక.

అంబర్‌పేట దగ్గర్కిరాగానె ఎడమవైపు చూసి, '' ఈ తోవ ఎటో'' అని అడిగింది పిచ్చుక.

''అది సంఘీ దేవాలయానికి దారి''

''అట్టనా, ఆ అడవిలో కనిపించేదేనా'' అవును ఈ దేవుల్ల గుడులు ఎక్కువ అడవిలో వుంటయి ఎందుకో'' అంది పిచ్చుక.

''ఊళ్లో మనుషులుంటరు కనుక'' అంది కాకి.

''అట్లనా అంటు ఆలోచనల్లో కెళ్లింది పిచ్చుక. అవునూ మనిషి నిజంగా మాయగాడె. మనిషి శ్రమను దోచుకుంటు, తన దోపిడిని ప్రశ్నించకుండ గుడిలో శఠగోపం పెట్టిస్తడు. వీళ్లు తలలొంచి నిలుచుండి అడగదలచు కున్నయి అన్నీ మర్చిపోతరు. ఇదో గారడి కదా'' అని కాకి వైపు చూసింది.

ఎల్‌బినగర్ రింగ్‌రోడ్డు చౌరస్తాలోని రాజీవ్ విగ్రహం చేతిమీద ఊరపిచ్చుక, బుజం మీద కాకి కూర్చొని చుట్టు చూస్తువున్నాయి. దిల్‌సుఖ్‌నగర్ వైపు ముఖాన్ని తిప్పగానే ఊరపిచ్చుకకు ఊపిరాడలేదు ''ఏంది కంపువాసన'' అంది.

అది విన్న కాకి ''ఇప్పుడు నయం, గతంలో నేనొకసారి వచ్చినపుడు



దుర్వాసన వుండే'' అంది. సాగర్ రోడ్ వైపు తలను తిప్పి ''ఆ వాసన వదిలేయి ఇదేం పొగ, కళ్లు మండుతున్నాయి'' అంది కాకి.

''అవునుగదా'' అంటు తన కాలితో ముక్కు నొకసారి తుడుచుకుంది.

''పద ముందుకుపోదాం'' అంటు ఎగిరింది కాకి. ఊరపిచ్చుకా ఎగిరింది. రెండు కల్సి దిల్‌సుఖ్ నగర్‌వైపు వెళ్లాయి. మధ్యన వున్న వైట్‌హౌజ్ ఫంక్షన్‌హాల్ మీద వాలినయి. వంటగదుల నుండి కమ్మటి వాసనలొస్తువున్నయి.

''ఇక్కడ పెళ్లిజరుగుతూంది'' అంది పిచ్చుక.

''జరిగితే, నీవు పందిట్లోకి వెళ్లి అక్షింతలైనా తినగలవు నేను పోలేను కదా?''

''అక్షింతలేంకర్మ, వాటికంత పసుపే పసుపు. వాటిని తినలేం. తిన్నా వంటికి మంచివికావు. కాసేపు ఆగితే భోజనాలకు లేస్తరు. ఓ మూలన ఎంగిలిప్లేట్లను పెడతారు. చాలు మనకు'' అంది పిచ్చుక.

''పట్నం వచ్చినా నా బతుక్కి ఎంగిలి మెతుకులేనా'' అని విసుక్కుంది కాకి.

''ఊరిమెతుకుల కంటె కాస్త రుచిగా వుంటా యిలె'' అంది పిచ్చుక.

''రుచిగానే ఉంటయి. మసాలాలు, నూనెలు ఎక్కువ వుంటయి. పొద్దంత నీళ్లు బాగా తాగాలి. ఈ రోజుల్లో నీళ్లెక్కడ దొరుకుతయి. తిండి దొరుకుతది కాని నీళ్లు దొరకవా''య అంది కాకి.

''అది నిజమే నల్లాలు ఎప్పుడొస్తయో తెలవదు. ఈ ప్లాట్స్ సిస్టం వచ్చినుండి ఎక్కడి బోరు అక్కడె. ఏ ప్లాట్‌లో కిచ్చేనీళ్లు ఆ ప్లాట్‌లోనే పోక పైపుల్లోనే. నీకు నీటి చుక్క బయటికి కనిపించదు. నీవంటె ఏ వెంటిలేటరో నుండో ఏ కిటికీ నుండో పొయి తాగుతావు. నేనెట్లా పోగలను? ఒకవేళ్ల పోయినా ఎవరు చూసినా ఆచ్ అని విదిలిస్తునే వుంటారు. ఇక నీళ్లు తాగడమెక్కడ'' అంది కాకి బాధగా.

''నీమీద జనానికి అట్లావుంది. నీవు చాన్స్ దొరికితే అయిందాన్ని కానిదాన్ని ఎత్తుకొస్తవాయె! టూత్‌బ్రష్‌లను కూడా వదలవయితి. ఎండపోసిన మాంసం ముక్కలను ఎత్తుకొస్తవాయె'' అంది పిచ్చుక.

''ఎత్తుకొచ్చినా ఎత్తుకరాకపోయినా చిన్నప్పటి నుండి తమ తమ పిల్లలకు కాకి మంచిది కాదని నూరిపోసి నామీద ఓ చెడుభావాన్ని కలిగిస్తరు'' అంది కాకి లోతుల్లోకిపోయి బాధగా.

''నీవనేది నిజమే నీవు చేయని పనులను చేసినవు అని బదునాం చేసుకుంటు పోయిరి'' అంది పిచ్చుక సానుభూతిగ.

ఈలోపు దిల్‌సుఖ్‌నగర్‌వొచ్చి ట్రాఫిక్, బండ్లు వొదిలే పొగకు వుక్కిరి బిక్కిరి అయిపోతున్నరు. అటు చూడు ఆటోవాళ్లు కాస్తంత సందుదొరికితే చాలు దూసుకుపోతూనే వున్నరు. ఎటొచ్చి పాదాచారులకె పరేషాన్. ఆ పక్కలెమ్మటి చూడు వచ్చిపోయే స్టీరింగ్ ఆటోలు. వాటిదోగోల అడుగడుగున ఆపుతూనె వుంటరు. ఎక్కేవాడు దిగేవాడు అక్కడ పక్కవాడు తికమక. ఆ పండ్ల బండ్లు ఓటి కదలలేని మెదలలేని పరిస్థితి. పేరుకే దిల్‌సుఖ్‌నగర్ కాని అది దిల్‌పరేషాన్ నగర్ అయిపోయింది. పదకొంచెం ముందుకుపోదాం'' పిచ్చుక అంది.

''సరె'' అంటూ కదిలింది కాకి. పిచ్చుక ముందుకుపోతూ పక్కకు చూసింది. పక్కనే ఎత్తయిన టవరు. దానిని చూసి దీనిమీద వాలితె మనకు ఈ పొగ పొల్యూషన్ ఉండదు అనుకుంట'' అంది కాకి.

''మరి తిండి తిప్పలు, నీళ్లు గిట్ట'' అంది పిచ్చుక. కాసేపు దాని మీద వాలి చుట్టూ చూసినయి. ముందుకు నడిచాయి. ఇమ్లిబన్ స్టేషన్ వచ్చింది. దొడ్లో పశువుల్లాగ బస్సులు వస్తూపోతూ వున్నయి. కిందివైపు చూస్తే మూసీనది. నీళ్లను చూడగానె దప్పిక అయింది. వంగి నీటిని చూసి ఎగిరి పక్కనున్న రాతిగోడ మీద కూర్చొని

''ఛీ మురికి నీరు'' అంది పిచ్చుక.

''మరి మంచి నీళ్లెక్కడ దొరుకుతాయి'' అంది కాకి.

''అదిగో అక్కడ నల్లా దగ్గర జనం సీసాలు నింపుకుంటున్నరు. వాళ్లు కదలగానే తాగుదాం'' అంటూ వెళ్లి పక్కన్నే ప్లగ్‌పెట్టి వున్న పనిచేయని ట్యాప్ మీద వాలినయి.

''మనం ఇక్కడికొచ్చేసరికే నీ రంగు సొరలు పోయి సొంతం నల్లగ మారింది'' అంది కాకి.

''మరి అంతటా పొగే పొగ కదా! సాయంత్రం వరకు ఇంకెంత మారిపోతనో ఏమో. ఎక్కడన్న మంచి నీళ్లు కనిపిస్తే స్నానం చేయాలి'' అంది పిచ్చుక.

''లేకపోతే నాలాగ నల్లగుంటె ఎవరు దగ్గరికి రానీయరు. ఇష్టపడరు. ఎందుకో మనుషులకు నలుపు రంగంటె పడనట్టుంది. నన్నేకాదు పాలిచ్చే బర్రెను గూడ ఇష్టపడరు. అదే గోవును పూజిస్తరు. దానిపాలు తెల్లయే, బర్రెపాలు తెల్లయే. పాలు తాగుతారు కాని పాలిచ్చేదాన్ని అంతగా ఇష్ట పడరు'' అంది తన రంగు నల్లరంగున్నందుకు విచారిస్తున్నట్టుగా చూస్తూ.

''ఆ ఎటువెడదాము'' అంది పిచ్చుక.

''ఇటు వెలితే చార్‌మినార్, అటు వెలితే టాంక్‌బండ్. చార్‌మినార్ వైపు ఎప్పుడూ గోలలే. అప్పుడప్పుడు కర్ఫ్యూ కూడ వుంటది. లేనిపోని గోలలెందుకు పద'' అంటూ ఎగిరిపోయినయి. బిర్లామందిర్ పైకి వాలిచుట్టూ చూసినయి. జనం గుడికొచ్చి పోతున్నరు. అందరి చేతుల్లో పూల బుట్టలే. ఈ పూలు ఏమిటికి పనికిరావు. వీటిని మనుషులు తినలేరు మనం తినడానికి పనికిరావు. అందానికే తప్పా ఆహారానికి అస్సలు పనికిరావు'' అంది కాకి.

''అక్కడ ఏదో కాగితాలను కాలుస్తున్నరు?'' అంది పిచ్చుక.

''అది సచివాలయం కదా ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కొన్నాళ్లుంచి చిత్తుకాగితాలుగ కాలేస్తరులె. అందుకే గదా ఇప్పుడు కంప్యూటర్లు పెట్టింది'' అంది కాకి.

''అట్లనా'' అంది పిచ్చుక.

''దరఖాస్తు పెట్టిన తేది, ఏమంత్రి దగ్గరుంది ఏం జరిగింది, ఏం జరుగుతుంది ఒక్క బటన్ నొక్కితె అంతా బయటికొస్తది'' అంది కాకి.

'' ఓహో'' అంటు నోరు తెరిచింది పిచ్చుక.

''అటు చూడు ఆ వెనక చెక్కులు అచ్చయి తయి''


''అంటే చెల్లె చెక్కులేనా?'' లేకపోతే నకిలి స్టాంపుల్లా నకిలి చెక్కులా'' అని అడిగింది పిచ్చుక. ఉన్నట్టుండి కాకికావు కావుమంది. అది విన్న పిచ్చుక ''ఏమది అలా అరిచావు ఏమైంది'' అని కాకివైపు చూసింది.

''ఏం లేదు అటు చూడు ఆ చెరువు పక్కన ఎంత అందమైన కట్టడమో'' అంది పిచ్చుక అటుచూస్తు ''అవును కదా? ఏంటో అది'' అంది.

''అది ఓ మహానుబావుని స్మారక....''

మహరాజుల్లాగా బతికెటోన్ని చంపి ఆ తరువాత దానిని నిర్మించి తరించారు. ఈ రాజకీ యాలు పొడుగానూ కుర్చీకోసం ఏదైనా చేస్తరు'' అందికాకి.





## జంట హీరోయిన్లు

*గతంలో శ్రీదేవి, జయప్రద జంటలాగా, ఇప్పుడు ప్రియాంకా, లారాదత్తా జంట పాపులర్ అయ్యింది. ఈ మధ్య వచ్చిన ముక్కోణపు ప్రేమకథల్లో వీళ్లే కనిపిస్తున్నారు. అయితే ఒక్క పిక్చర్ కూడా హిట్ కాకపోయేసరికి ఈ అమ్మాయిలకు నీరసమొచ్చింది. ఇక మీదట ఇద్దరం కలిసి సినిమాల్లో నటించమంటున్నారు. కానీ, నటిస్తే మటుకు అసలు మీతో సినిమాలు తీసెదెవరు తల్లీ అంటూ నిర్మాతలు వాపోతున్నారు.*

''మొదట మనం వాలింది డబ్బున్న వాళ్లు కట్టించిన ద్యానమందిరం. అక్కడ మనిషి సృష్టించిన దేవుడుంటాడు. అక్కడికెళ్లి అందరు దండాలు పెట్టుకొని వస్తారు'' అంది కాకి.

''అక్కడ దేవుడే వుంటే ఆ మధ్య దొంగలు దోచుకుంద్రట. అదెట్ల జరిగె'' అంది పిచ్చుక.

''ఇక్కడేంది విజయవాడలో కనకదుర్గమ్మ కంట్లోనే కారం చల్లింద్రు. ఈ మనిషి ఉన్నడు చూడు పెద్ద మాయగాడు. నామీదనె లేనిపోని నిందలు వేసి దొంగతనాన్ని అంట గట్టి తమ తమ పిల్లలను తీర్చిదిద్దుకుంటున్న సంగతి చెపితి కదా. నీవు వినొచ్చు దాచిపెట్టింది కాకెత్తుకపాయే అని నన్నే దొంగనుచేసిరి'' అన్నది కాకి కాస్త అసహనంగా కదులుతు. అప్పుడు దాని కళ్లు పసుపు పచ్చగ మిరపగింజల్లా కదిలినయి.

''నన్ను మాత్రం బతకనిచ్చింద్రా ఎప్పుడు వల విసురుతూనే వున్నరు. విసిరి విసిరి నా పూర్వికులను నాశనం చేసింద్రు'' అన్నది విచారంగా పిచ్చుక.

''ఇకనుండి మనం జాగ్రత్తగా ఉండాలి సుమా'' అంటూ తన కళ్లను ఓసారి మూసి తెరిచింది. అప్పుడు దాని కనుగుడ్లు మిరపగింజల్లా కనిపించినయి.

''నాకు కళ్లు మండుతున్నయి. ఎటూ కనపడడం లేదు'' అంది పిచ్చుక.

''నాకు అంతేవుంది. కాసేపు ఆ చెరువు గట్టున వున్న పార్కులోకి వెలదాంపద'' అంటూ కలిసి సంజీవయ్య పార్కువైపు ఎగిరిపోతూ

''అటు చూడు తెలుగువారి తేజోమూర్తులు'' అంటు ట్యాంక్‌బండ్‌మీది విగ్రహాలను చూపించింది పిచ్చుక'' ఆ అటు వెళ్లొద్దు. వాటిమీద రెట్టవేసింది మీరే అని పట్టుకుంటే'' అంది కాకి.

''అదీ జరగొచ్చు. ఇక్కడ అటుపోతే పోలీసులు ఆపి ఫైన్ రాస్తుంటరు'' అంది పిచ్చుక.

కాకి కిందకు దృష్టి సారించి '' ఈ చెర్లో అన్నీ ఎలుకలేవున్నయి వాలుదామా?'' అంది.

''అవి నిజమైన ఎలుకలు కాదు వినాయకుని వాహనాలు. ఆయనలాగ అవి బొమ్మలే. వాటికి అద్దిన రంగులు కరిగి రసాయనిక వాసన రావటం లేదూ? ఆ గాలిని మనం పీల్చితిమా ఆరోగ్యం చెడిపోతది'' అంది పిచ్చుక. నీళ్ల అడుగును చూస్తు.

''మరి మనుషుల ఆరోగ్యం'' అంది కాకి.

''అందుకే కదా ఈ పెద్ద పెద్ద ఆసుపత్రులు'' అంది పిచ్చుక.

''మనుషులు ఎంత తెలివి తక్కువోల్లు ఒక వైపు పైసలు పెట్టి రోగాలు కొనుక్కుంటు మరోవైపు పైసలు పెట్టి బాగుచేయించుకుంటరు'' అన్నది కాకి వెటకారంగా పిచ్చుకవైపు చూస్తు.

పార్కులో కాసేపుండి అక్కడ పడివున్న తినుబండారాలను ఏరుకుతిని ''ఎటుపోదాం'' అంది పిచ్చుక.

''సికింద్రాబాదును చూద్దాం'' అంది కాకి.

'' ఏముంది దుకాణాలు, రైల్వేస్టేషన్'' అంది పిచ్చుక.

''బేగంపేట విమానాశ్రయం కూడా వుంది. అక్కడ మనలరానివ్వర్. మనం అడ్డంపోతే అంత పెద్ద విమానం కూలిపోతదట. అదెట్ల నాకర్థమే కాదు! కనక వొదిలేయ్ పదపోదాం'' అని రెండు పక్షులు ఎగిరి కంటోన్‌మెంట్‌వైపు పోతూ ''ఈ విషయం విన్నవా'' అంది పిచ్చుక.

''ఏ విషయం''

''నేను కొన్ని రోజుల కింద, ఓ హోటల్ కిటికీలో వాలినపుడు వాళ్లు రేడియో పెట్టిరి. సైనిక నివాసాల్లోని కాలిభూములు ప్రైవేటు వ్యక్తుల ఆక్రమన అంది రేడియో'' అంది పిచ్చుక. సైనికులేమో మన భూభాగంలో పరాయివాళ్లు అడుగుపెట్టకుండా రాత్రి పగలు కాపలాకాస్తే ఊళ్లో వుంటున్న వాళ్లేమో వాళ్లుండే స్థలాలను ఆక్రమించుకొని పంక్షన్‌హాళ్లు, సినిమా టాకీసులు కడుతున్నరాయె. అటువంటి చోట్ల మనం పోవడం దేనికి. తిరిగి ఊరెళ్లిపోదాం పద అంది'' కాకి.

''సరె, పోతప్పుడు ట్రైనులో పోదాం'' అంది పిచ్చుక.

''ట్రైనులో అనకు. అది సాధ్యం కాదు. నన్ను డబ్బాలోకి రానీరు.'' పిచ్చుక అర్థం చేసుకుని కిచకిచమని నవ్వి సరె ఇద్దరం డబ్బా మీదనె కూర్చుందాంపద డీజిల్ ఇంజనేకద'' అంటూ రెండు పక్షులు రైల్వేస్టేషన్ వైపు ఎగిరిపోతు...

''మనం ఊళ్లోకి పోవద్దు. ఊళ్లు పాడయి పోయినయి. అడవికే పోదాం అంది పిచ్చుక.

''అడవిలో ఉన్నవాళ్లే చర్చలకు అని పట్టణం వస్తుంటె మనం అడవికి ఎందుకు?''

''ఆ చర్చలు తెగేవా ముడిపడేవా! అయినా వాళ్లతో మనకేం పని. మనం అడవికే పోదాం. మనం ఈ కాలుష్యాన్ని తట్టుకోలేం. బతికుంటే బలిసాకు తినొచ్చు. అందుకే మధ్యలో దిగి పోదాం.''

★